# సినీ తేజం

కృష్ణానగర్ అంటే– మద్రాస్‌లో పాండీ బజార్‌లా వుంటుంది.

కాబోయే చిరంజీవులూ– కాబోయే రాఘవేంద్రరావులూ– కాబోయే పరుచూరిలు, వేటూరిలూ.. చాలామంది వుంటారక్కడ.

సాయితేజ 'చిరంజీవం'త వాడు కావాలని కృష్ణానగర్‌లో వెలిశాడు.

సాయితేజ యాక్టివ్‌గా అందర్నీ కలుస్తున్నాడు– పలకరిస్తున్నాడు.

ఆ పూటకి టిఫిన్ ఎవడు పెడతాడా? 'టీ' ఎవరు పోయిస్తారా అన్న ఆశతో–

ఆకలి పెట్రేగుతోంది.

మరింత ఉత్సాహంగా అందర్నీ 'హాయ్' అంటూ పలకరించి– 'భాయ్' అంటూ కౌగిలించుకుంటూ షేక్‌హాండ్సిస్తూ చిరంజీవి పద్దెనిమిదో తమ్ముడిలా షోకులు పోతున్నాడు.

నిజం చెప్పాలంటే ఈ ఉత్సాహం నటించడం సాయితేజకి బాగా వచ్చు. అదొక్కటే దేవుడిచ్చిన వరం.

సినిమాల్లో నటిద్దామని ఈ వూరు వచ్చి పడిగాపులు పడుతున్నాడు. కాళ్ళకి బలపాలు కట్టుకుని అవి అరిగిపోయేలా తిరుగుతున్నాడు. కానీ ఒక్క. డైరెక్టరూ సాయితేజ గ్లామర్‌కి.. 'ఆహా ఓహో' అనట్లేదు.. వేషం

ఇవ్వట్లేదు.

ఒకళ్ళిద్దరు పెద్ద డైరెక్టర్లు పదే పదే వస్తోన్నందుకు పొమ్మంటూ చిరాకుపడి... "బాబూ! నువ్వెప్పుడైనా మొహం అద్దంలో చూసుకున్నావా?" అని మొహమ్మీదే అనేశారు.

"ఈ సినిమాలో అన్నీ చిన్న వేషాలే నెక్స్ట్ పిక్చర్‌లో వేషం పెద్దది ఇస్తా"నన్నాడు- అని నవ్వు మొహాన్ని పులుముకుని బైటకొచ్చి చెప్పేవాడు.

అందరికీ నిజం ఏమిటో తెలుసు-

ఆ విషయం వాళ్ళకీ తెల్సనీ సాయితేజకీ తెల్సు-

నవ్వు నటించకపోతే... 'హాయ్- భాయ్' అనే వాళ్ళ దృష్టిలో లోకువైపోతాం- అని అతనికి అనుభవం నేర్పిన పాఠం.

టిఫిన్ సెంటర్లోకి అడుగుపెట్టాడు మిత్రబృందంతో. జేబులో చెయ్యి పెట్టుకుంటే ఐదు రూపాయల కాయిన్, రెండు రూపాయల కాయిన్ చేతికి తగిలాయి.

కళ్ళు తిరిగాయి.

హాయ్ బాయ్‌లు.. ముగ్గురు ఎదురుగుండా కూచున్నారు. వాళ్ళూ తనలాంటివాళ్ళే... పాపం వాళ్ళకి ఈ ఏడ్రూపాయలూ ఉండవ్!

సప్లైయర్ రాగానే 'టూబై ఫోర్ ఛాయ్' అన్నాడు సాయితేజ.

"ఏం గురూ... బన్నూ.. బ్రెడ్డూ.. కనీసం బిస్కట్లు కూడా ఇప్పించవా ఏంటి?" అన్నాడు కాబోయే మహా దర్శకుడు.

"ఇవ్వాళ గురువారం.. నేను 'టీ' తప్ప ఏమీ తాగను, ఇప్పించను" సాయితేజ సాయిబాబాని అడ్డెట్టుకుని బతికిపోయాడు.

పక్క టేబుల్నించి ఆ పక్క టేబుల్ మీదికి ఆఖరికి వీళ్ళ టేబుల్ మీదికి వచ్చిన న్యూస్ పేపరులో సినిమా వార్తలు ఆ హోటల్లో టీ తాగే వాళ్ళందరికీ... ముఖ్య వార్తలు.

ఎవరెప్పుడు ఏ సినిమా ప్రారంభిస్తున్నారో-

ఏ స్టూడియోలో షూటింగ్ జరుగుతుందో- అక్కడికి పరుగెట్టాల్సిన నటీనటులు అందరూ... పోటా పోటీలు పడుతుంటారు.

సాయితేజకి తెల్సు- పెళ్లి మండపంలో విందులు అయ్యాక పడేసే విస్తరాకులు ఎక్కడుంటాయో వెతుక్కునే కుక్కల బతుక్కీ.. తమలాంటి వారికీ తేడా లేదనీ.. మనస్సు చాలాసార్లు వెనక్కి లాగుతోంది.. కానీ రేపో నేడో తానో గ్రేట్ హీరో అవుతానని, తన టాలెంట్ అలాంటిదనీ నమ్మకం బలంగా ఉండటంవల్ల చాటుగా తన భుజాలు తానే తట్టుకుని పాత సినిమాల్లో డైలాగ్స్ వప్పజెప్పి... 'శభాష్' అనిపించుకుని, అలా అన్న 'హాయ్.. భాయ్'లకు టీలూ టిఫిన్లూ గట్రా పోయించేస్తాడు. పక్క టేబుల్ నుంచి ప్రదక్షణలు చేస్తూ వస్తున్న పేపరు రాగానే అందరూ లాక్కున్నారు.

తనకీ ఓ పేజీ దొరికింది.

అది సినిమా పేజీ కాదు.

'సరేలే! వాళ్లు చదివేదాకా.. ఇదే తిరగేద్దాం' అనుకుని పేపరు చూడ్డం మొదలెట్టాడు సాయితేజ.

ఆశ్చర్యం... తన ఫోటో పేపర్లో వచ్చింది.

ఏమిటి...? నా ఫోటో దీంట్లోకెలా వచ్చింది- అని ఆలోచించే వ్యవధేలేదతనికి.

గబగబా ఆ ప్రకటన చదివాడు. 'విన్నపం' అని హెడ్డింగు... 'ఏవండీ మీరు ఎక్కడున్నా సినిమా వార్తలకోసమయినా పేపరు చూస్తారని నాకు తెల్సు. మీరు గొప్ప నటుడైతే ఎలాగా మాతో గడిపే టైముండదు. ఈలోగా ఇంటికి రండి. అబ్బాయికి కొడుకు పుట్టాడు. అచ్చం మీ పోలికే.. మనవణ్ణి చూడ్డానికైనా రండి... మీ కోసం ఎదురుచూస్తున్నాం!'

నాకు ముప్ఫైయేళ్ళే అంటూ హాయ్ భాయిల్తో చెప్పుకొస్తున్న

సాయితేజకి ముచ్చెమట్లు పోశాయి. ఆ వార్త చదవగానే-

పనివున్నట్లు మంచినీళ్ల గ్లాసు తొణికించి- ఆ పేపరు మీద వొలకబోశాడు.

ఆ పేపర్ని ఉండచుట్టి బయపడేశాడు కానీ.. వయసుని తగ్గించలేదు.

ఒకళ్ళిద్దరు తెల్సున్న వాళ్ళు కనిపిస్తే వాళ్లు పేపరు చూసుంటారేమోనని మొహం చాటేశాడు.

అర్జంటుగా ఓ తెల్సున్న వాళ్ళ దగ్గరకెళ్ళి ఐదొందలు అప్పుచేసి, పెళ్ళానికి ఫోనుచేసి చడామడా తిట్టాడు.

"చాలా డబ్బులైపోతున్నాయి. మీ తిట్ల దండకం ఆపి, కాసిన్ని డబ్బులు మిగిల్చి- కాకినాడకి టిక్కెట్టు కొనుక్కుని తగలడండి" అంది భార్య.

టప్పున ఫోను పెట్టేశాడు.

కాకినాడకెళ్ళాలని కాదు- ఈ కాసిన్ని పైసలుంటే ఎవరో ప్రొడక్షన్ మేనేజర్‌కి బిర్యాని తినిపించి వేషం అడగొచ్చుని.

తనకి బ్రెడ్ లేకపోయినా పర్వాలేదుగానీ.. కాస్తో కూస్తో పలకుబడి వున్న వాళ్లకి బిర్యానీలూ.. బీర్లూ నైవేద్యం పెడితే ఓ వేషం దొరకచ్చు- అదీ ఆశ...

నెల్లాళ్లు ఇంటికి దూరంగా ఉండి... ఒక్కసారైనా కెమెరా ముందు నిలబడకపోతే.. ఇంటికెళ్ళినా ఇంత కూడా గౌరవం దక్కదు.

ఓ ప్రొడక్షన్ మేనేజర్‌ను పట్టాడు సాయితేజా... అనుకున్నట్టుగా తీర్థ ప్రసాదాలకి రెండొందలు ఖర్చుపెట్టాడు.

బ్రేవ్‌మని త్రేన్చిన ప్రొడక్షన్ మేనేజర్ "నీకు జూనియర్ ఆర్టిస్టు కార్డుందా?" అని కిక్కులో ఎకసెక్కాలాడాడు.

సాయితేజా కళ్ళు ఉప్పుటేరులా పొంగిపోయాయి.

ఒక ఫ్రెండుతో కలిసి తీసుకున్న రూంకెళ్ళి బావురుమని ఏడ్చాడు.

తన వ్యధకి ముగింపులా ఇంటి ఓనరొచ్చి తలుపు తట్టాడు.

గుండె గుభేలుమంది సాయితేజకి... 'ముసలాడు అద్దెకోసం వచ్చాడేమో'నని కంగారుపడ్డాడు.

రూం పార్ట్‌నర్‌గా ఉన్న సంతోష్ నా చొక్కాలు రెండు పట్టుకుని పారిపోయాడు.

"బాబూ! సాయితేజా"

"గుడ్ ఈవెనింగ్ సార్"

"నీతో చిన్న పని పడిందయ్యా!"

'అద్దెకని చెప్పిచావొచ్చుగా' అనుకున్నాడు- నీళ్ళు నములుతున్న సాయితేజతో.

"నేను అర్జంటుగా సామర్లకోటకు వెళ్ళాలి.. రెండ్రోజుల్లో తిరిగొచ్చేద్దాం- నాకు తోడొస్తావా?"

"నేనా సామర్లకోటకా! నాకు చాలా షూటింగ్‌లున్నాయి. ఇవ్వాళ రేపట్లో రెండు కంపెనీలు నాకు 'కీ' రోలు ఇస్తామన్నారు. కానీ..సర్లెండి... మీకోసం వస్తాను. అయితే... నాకింకా ఇంటి దగ్గర్నుంచి మనియార్డరు రాలేదు. మీతో వచ్చి.... మళ్ళీ తిరిగొచ్చి.. మీ అద్దె కట్టి.. ఇవన్నీ కొంచెం ప్రాబ్లమే" ఫోజు కొట్టాడు సాయితేజ.

నిజం తనకి తెలుసు.

అబద్ధం ఆడటం.. నటిస్తూ గొప్పలు చెప్పడం... వీటన్నిటివల్లే.. తనకి నటుడవుతానన్న తహతహ బయల్దేరింది.

ఫ్రెండ్సందరూ.. తన డైలాగ్ మాడ్యులేషన్ విని.. 'ఆహో ఓహో' అని.. నిక్షేపంలాంటి ఉద్యోగాన్ని వదులుకొమ్మని రెచ్చగొట్టారు.

రెండేళ్లబట్టి ఇండస్ట్రీ చుట్టూ ప్రదక్షిణం- ఈ మధ్యలో ఒకట్రెండు

టీవీ సీరియల్స్‌లోనో.. విడుదలకు నోచుకోని సినిమాలో గ్రూప్‌కోసమో రంగేసుకున్నాడు... టీవీ వాళ్లు డబ్బులు ఎగ్గొట్టటంలో దిట్టలు! సినిమావాళ్ళు వాళ్ళ కన్నా ముదుర్లు!

నిజానికి.. కెమెరా ముందుకు వెళ్ళినప్పుడు వేసుకున్న రంగుకన్నా... వేషాలకోసం తిరిగేప్పుడు వేసుకున్న రంగులే ఎక్కువ.

ఎంత కోటింగ్ కొడితే తాత వయసువాడు- కొడుకు వయసుకు రాగలడు?

"ఏమయ్యా! ప్లీజ్.. నేనొక్కణ్ణి వెళ్ళలేను- నీకు తెలుసుకదా!" ఇంటి ఓనరు మళ్ళీ బతిమాలాడు.

"ఓకే సార్! మీకోసం వస్తున్నాను" అన్నాడు సాయితేజ. కనీసం అద్దె ప్రెజర్ తగ్గుతుందన్న ఆశతో.

సామర్లకోట వరకు వెళ్లి- కాకినాడ వెళ్ళకుండా - మనవణ్ణి చూడకుండా వచ్చెయ్యగలడా? వెళ్ళి పెళ్లాం పర్మిషన్తో మళ్లీ వెనక్కి తిరిగి రాగలడా?

అస్తవ్యస్త మనస్థితిలో... హౌస్ ఓనర్ నుంచి డబ్బులు తీసుకుని టికెట్‌కోసం బయల్దేరబోయాడు.

"నీ వేషాలు పాడు చేసుకున్నందుకూ.. నాకు తోడు వస్తున్నందుకు.. ఈనెల ఇంటద్దె కట్టక్కర్లేదయ్యా" అని ఓనర్ అనగానే దేవుడున్నాడనిపించి-

బట్టలు సర్దుకునే నెపంతో.. ఫ్రేమ్ అవుట్ అయిపోయాడు.

ఇప్పుడు సాయితేజ.. సామర్లకోటలోనే హౌస్ ఓనర్‌కు సేవ చేస్తాడా?

ఆ రెండ్రోజుల్లో కాకినాడ వెళ్ళి భార్యనీ... మనవణ్ణీ చూస్తాడా? జవాబు మనకి తెలీదుకానీ బట్టలు మడత పెట్టే వంకతో, మొహానికి హత్తుకున్న చొక్కాకి తెలుసు.

ఆ బట్టల చాటున పొంగుతున్న కన్నీళ్ళకి తెలుసు.

